క్లుప్తంగా

పలాస కోర్టులో న్యాయదినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టులో సోమవారం న్యాయ, రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ప్రతిజ్ఞ చేశారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎస్‌వీ రమణ, సూపరింటెండెంట్ పాణిగ్రహి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: రాజపురంలోని గాయత్రీ పరివార్‌ట్రస్టు ఆధ్వర్యంలో గాయత్రీ మహాయజ్ఞం ప్రారంభోత్సవ కలశ శోభాయాత్ర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా యజ్ఞశాలను పవిత్ర జలాలతో సంప్రోక్షణ చేశారు. అనంతరం దీపయజ్ఞం కార్యక్రమం కన్నుల పండువగా చేశారు.

చిన్నారులకు భోజనం వితరణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం గ్రామ సమీపంలో ఉన్న శ్రీసాయిసత్య సదనంలో 80 మంది చిన్నారులకు కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం భోజన సౌకర్యాన్ని దాతలు సమకూర్చారు. ఏరిస్ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పిండివంటలతో కూడిన భోజనం పెట్టారు. ఏరిస్ సీనియర్ మేనేజర్ కణితి కృష్ణారావు, పలాసకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తాళాసు గోవిందు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ ఏడో వార్డు పరిధి చినబడం అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ జరిగింది వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దువ్వాడ రమణయ్య పూజలు చేశారు.

ఆక్రమణ అడ్డుకోవాలని వినతి

సోంపేట: సోంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఆక్రమణను అడ్డుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద కోరారు. ఆదివారం రాత్రి మైదానానికి తూర్పువైపు ఉన్న స్థానికులు కొంతమంది క్రీడాస్థలాన్ని ఆక్రమించి రహదారి వేయడానికి జేసీబీతో సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన క్రికెట్ క్లబ్ సభ్యులు అడ్డుకున్నారు. సోమవారం ఉదయం జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మైదానాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ ఎస్.సత్యన్నారాయణను కలిసి ఆక్రమణలు తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు సాయిజస్వంత్ ఎంపిక

టెక్కలి రూరల్: టెక్కలిలోని ఎస్‌ఆర్‌ఆర్ కబడ్డీ క్లబ్‌లో శిక్షణ పొందిన డి.సాయిజస్వంత్ ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కోచ్ ఎస్.సీలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చడం ద్వారా జాతీయ స్థాయి పోటీలకు సాయిజస్వంత్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బాల కార్మికులతో పనులు నేరం

కోటబొమ్మాళి: బాల కార్మికులతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని టెక్కలి కార్మిక అధికారి ఆర్.రాధాకుమారి అన్నారు. కోటబొమ్మాళిలోని పలు వ్యాపార సంస్థలు, పరిశ్రమలను సోమవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎస్సై ఎస్.కేశవరావు, చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సెలర్లు డి.సీతారామ్, రాజు, గణపతిరావు ఉన్నారు.

వాసుదేవుని సన్నిధిలో హోమం

మందస: స్థానిక వాసుదేవుని సన్నిధిలో సోమవారం ఆధ్యాత్మిక చోటు చేసుకుంది. తిరుమంగై ఆళ్వార్ల తిరునక్షత్రం సందర్భంగా హోమం నిర్వహించారు. కృత్తికా దీపోత్సవం ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. తిరువీధుల ప్రదక్షణ కూడా చేపట్టారు. వాసుదేవసేవాసమితి, ఆలయ అభివృద్ధి కమిటీ, ఆండాళ్లగోష్టి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు సచ్చిదానందపాఢి, అనిల్‌పాండే, ఘనశ్యాం ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు.

జగన్నాథ స్వామికి 56 రకాల వంటకాలతో నైవేద్యం

టెక్కలి రూరల్: కార్తీకమాసం సందర్భంగా టెక్కలి పెద్దబ్రాహ్మణవీధిలోని గోపాల జగన్నాథస్వామికి సోమవారం 56 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. ఆలయ మాజీ కమిటీ చైర్మన్ నర్సింగ్‌సాబతో నేతృత్వంలో భక్తులంతా తయారు చేసిన పిండి వంటకాలను నైవేద్యంగా పెట్టారు.

శివనామ స్మరణ



కంచిలి: కుంబరినౌగాం కొండపై పూజలందుకంటున్న నందికేశ్వరుడు

టెక్కలి: రావివలస మల్లన్న దర్శనానికి చెరువు గట్టు మార్గంలో వెళ్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) టెక్కలి: రావివలస ఎండల మల్లన్నకు పూజలు చేస్తున్న భక్తజనం

శైవక్షేత్రాలు హర..హర..మహాదేవ నామస్మరణతో మారుమోగాయి. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల బాటపట్టారు. కార్తీక పౌర్ణమిని కూడా చాలా మంది సోమవారం జరుపుకున్నారు. దీంతో ఆలయాలు.. ఇళ్లల్లో దేదీప్యమానంగా దీపోత్సవాలను నిర్వహించారు. శివుడికి క్షీరాభిషేకాలు చేశారు. ఆలయాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కంచిలి: మఠం చెరువు వద్ద కార్తీక దీపోత్సవం



కోటబొమ్మాళి: శివకేశవ ఆలయంలో ప్రసాదం పంపిణీ చేస్తున్న సదాశివా ఫౌండేషన్ చైర్మన్ గంగాధరరావు



సోంపేట: బారువ సముద్రతీరంలో భక్తుల ప్రత్యేక పూజలు



వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్‌లోని నీలకంఠేశ్వరాలయం వద్ద బారులుదీరిన భక్తులు



సంతబొమ్మాళిలోని శివాలయం వద్ద బారులుదీరిన భక్తులు



ఇచ్ఛాపురం: పాతాళ సిద్ధేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు



కవిటి చంద్రశేఖర ఆలయంలో దీపాలంకరణసేవలో భక్తులు



ఇచ్ఛాపురం: బాహుదానదిలో దీపారాధన చేస్తున్న మహిళలు

సీఎం జగన్ పాలనలో క్రీడలకు పెద్దపీట

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని.. దీంట్లో భాగంగా 'ఆడుదాం ఆంధ్రా' ఇది అందరి ఆట అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి తొలిసారిగా ఉచితంగా క్రీడా కిట్లను అందించి గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ పోటీలలో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. మండలంలోని 27 గ్రామ సచివాలయాలకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, రింగ్ కిట్లు చేరాయని.. ఈ మేరకు కిట్‌లను అందిస్తున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొల్లి భాస్కరరావు, ధర్మారావు, పార్టీ నాయకులు డొంక విద్యాసాగర్, కర్రి తిరుపతి, కె.విఘ్నేష్, నరేష్ ఉన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఉదయ్‌కుమార్, అధికారులు



సోంపేట: క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



నందిగాం: క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: క్రీడలకు సంబంధించిన సామగ్రిని సచివాలయాలకు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి సోమవారం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని 22 సచివాలయాలకు ప్రభుత్వం సమకూర్చిన క్రీడా సామగ్రిని పంచాయతీ కార్యదర్శులకు అందించారు. సచివాలయ స్థాయిలో డిసెంబర్ 15 నుంచి ప్రారంభంకానున్న క్రీడాపోటీలను ప్రజా ప్రతినిధులు, క్రీడాకారుల సహకారంతో వ్యాయామ ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్ని జోగారావు, తమిరె రాజు ఉన్నారు.

సోంపేట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన క్రీడా కిట్లను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాస్ పంపిణీ చేశారు. ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, ఈవోపీఆర్డీ వెంకటరావు, పంచాయతీ ఈవో వరప్రసాద్, సర్పంచ్ నగిరి ప్రభావతి, జేసీఎస్ మండల కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మందస: చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సోంపేట కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎ.రాము అన్నారు. జిల్లా న్యాయసేవా అధికారసంస్థ, జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుడారిసింగి పంచాయతీ కళింగనగర్‌లో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరించుకోవడం ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతోందన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లోక్‌అదాలత్, మెగా లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీయే ఉభయ వర్గాలు విజయానికి రాజమార్గమని పేర్కొన్నారు. కళింగనగర్ వివాదరహిత గ్రామంగా రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం అభినందనీయమన్నారు. సర్పంచ్ సురేష్ కుమార్‌పాణిగ్రాహి, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, కాశీబుగ్గ, మందస ఎస్సైలు జి.శంకరరావు, సీహెచ్ హరికృష్ణ, డీటీ మద్దిల కృష్ణమూర్తి, ఎంఆర్‌ఐ సవర చిన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు సీర లోకనాథ్, గిరిజన నాయకులు ఢిల్లీ, చైతన్యో, దాలిబంధు, కైలాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

కార్తీక మహోత్సవంలో మంత్రి కుటుంబం

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంభా పట్టణంలోని వార్డు నంబర్ ఒకట్లో బాపూజీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్తీకేశ్వర పూజా మహోత్సవంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఛత్రపూర్ ఎమ్మెల్యే సుభాష్ చంద్రబెహరా, ఎల్‌ఐసీ ఉన్నత అధికారి సూర్యనారాయణ నాహక్, వార్డు కౌన్సిలర్ సాగర్ నాహక్, చక్రా రాజారావు, గుజ్జు జోగారావు, అగ్గున సూర్యారావు, సురేష్ ఫాణీగ్రహి, ఎజ్రా పాల్గొన్నారు.



కార్తీకేశ్వరుని సన్నిధిలో మంత్రి అప్పలరాజు తదితరులు

సీఎం జగన్‌ను కలిసేందుకు ముగ్గురికి అవకాశం

- రైతు సంఘాల ప్రతినిధులకు మంత్రి సీదిరి హామీ

పలాస: పలాసకు త్వరలో రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించేందుకు ముగ్గురు ప్రతినిధులకు అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు సోమవారం మంత్రిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి ఉద్దానం జీడి, కొబ్బరి, ఇతర సమస్యలను వివరించారు. ఈ సమస్యలపై రైతు సంఘాలు గత కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నాయని, ముఖ్యంగా జీడి పంటకు తగిన గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రికి వివరించారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లడానికి అవకాశం కల్పించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి ముగ్గురు ప్రతినిధులను కల్పించేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీ జీడి రైతాంగం సంఘం కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, ప్రతినిధులు సాతుపల్లి కాంతారావు, కుత్తం వినోద్, కోనేరు గురయ్య, ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతు సంఘం కన్వీనరు జె.ఎస్.వి. ప్రసాద్, సప్ప లక్ష్మీనారాయణ, ఇప్పిలి కృష్ణారావు, సోంపేట ప్రతినిధి తడక జోగారావు, అర్జి దానేసు, అంబటి ఆనందరావు ఉన్నారు.



మంత్రి అప్పలరాజుతో మాట్లాడుతున్న రైతు సంఘం ప్రతినిధులు

జిల్లా కలెక్టర్ దృష్టికి టెక్కలి సమస్యలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

టెక్కలి: జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. వార్డు కౌన్సిలర్ బడగల సుజాత సమక్షంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు వద్ద ప్రజలు రోడ్డు విషయాన్ని ప్రసావించారన్నారు. దీంతో అప్పుడే రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే నెమలినారాయణపురం గ్రామం నుంచి దత్తత్రేయ ఆశ్రమానికి అనుసంధానంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బడగల బళ్లయ్యనాయుడు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, నాయకులు దున్న సత్యం, తంగుడు కనకరాజు, మున్సిపల్ ఏఈ అవినాష్ ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, కౌన్సిలర్ సుజాత

ఇంటింటికీ సంక్షేమం చేరువ

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరువయ్యావని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి గ్రామసచివాలయం–1 పరిధిలోని శ్రీనివాసానగర్‌లో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, నాయకులు డాక్టర్ దువ్వాడ హైందవి, మోహన్, కె.రవికుమార్ గాంధీ, వి.అశోక్, రమేష్, రాహుల్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

వాసవి సేవా సమితి ఔదార్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన వాసవి సేవాసమితి ఔదర్యాన్ని చాటుకుంది. బోనాలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారు. అనారోగ్యంతో మరణించడంతో పదేళ్లలోపు వారి పిల్లలు గార్డెన్‌గా ఉన్న తులసమ్మ వద్ద తలదాచుకుంటున్నారు. వారికి అండగా ఉండాలని కాశీబుగ్గ వైశ్యసంఘ యువజన అధ్యక్షుడు కోట్ని విజయ భావించారు. రూ. 41,500 సేకరించారు. అలాగే ఐదు వేల రూపాయల విలువైన కొత్త దుస్తులు, ఆరు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు సమకూర్చారు. వీటిని పిల్లలకు సోమవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో అడ్వకేట్ అందవరపు కల్యాణ్, కార్యదర్శి సిందిరి నరేష్, సూరి సంతోష్, తంగుడు అచ్యుత్, తలగాన నరసింహమూర్తి పాల్గొన్నారు.



చిన్నారులకు సాయాన్ని అందజేస్తున్న దాతలు

దూడపై గుర్తు తెలియని జంతువు దాడి

మందస: అంబుగాంలో గుర్తు తెలియని జంతువు రైతులను భయపెడుతోంది. జీడితోటల్లో కట్టిన దూడలపై దాడి చేసి చంపి తినేస్తోంది. నెల రోజుల క్రితం అంబుగాం, లింబుగాం ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తోటల్లో తిరిగిన ఈ జంతువు మళ్లీ మూడు రోజులుగా జీడి, మామిడి తోటల్లో గల పశువులశాలల్లో కట్టిన దూడ (పెయ్యి)లపై దాడి చేయడం ప్రారంభించింది. తాజాగా రైతు గుజ్జుల ప్రసాద్ తమ ఆవు దూడలను తోటలో కట్టగా.. శనివారం రాత్రి దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి చంపేసింది. గతంలో కూడా ఇదే రైతుకు చెందిన మూడు దూడలను చంపేసింది. అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా...

కళాకారులకు సత్కారం

ఇచ్ఛాపురం రూరల్: భారతీయ వారసత్వపు కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కారంగి మోహనరావు అన్నారు. టి.బరపురం సీతారాముల ఆలయంలో సంగీత కళాకారులు చలపరాయి వినోద్‌కుమార్, కాతిల ధనావతి, తిప్పన ధనుంజయరెడ్డిలను సోమవారం సత్కరించారు.

వైద్యానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: పీఎంపురం పంచాయతీ సాగర్ కాలనీ చెందిన భద్రాచలం తారకేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పూండికి చెందిన 'మన సున్న లోకల్ ఫ్రెండ్స్' అండగా నిలిచింది. వైద్యం కోసం రూ. 11 వేలను సేకరించింది. ఈ మొత్తాన్ని బాధితుడికి సోమవారం అందజేసినట్టు లోకల్ ఫ్రెండ్స్ అధ్యక్షుడు కీలు లోకనాథం తెలిపారు.

బాక్సింగ్ పోటీలకు గేయామృత

టెక్కలి: ఆలిండియా సౌత్ వెస్ట్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన టెక్కలి క్రీడా వికాస కేంద్రం క్రీడాకారిణి బొడ్డ గేయామృత ఎంపికైంది. ఈ విషయాన్ని కోచ్ ఎస్.శేఖర్ సోమవారం తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో జేఎన్‌టీయూ పరిధిలో నిర్వహించిన ఎంపికల్లో భాగంగా గేయామృత ఎంపికై నట్లు ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 25 నుంచి 30వ తేదీ వరకు చండీఘర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఈమె పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల రక్తదానం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో సోమవారం 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.ప్రవీణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 20 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన బ్లడ్‌బ్యాంకు సభ్యులు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో హవల్దారు రవికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి చర్యలు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలోని ప్రకాష్‌నగర్‌కాలనీ సమీపంలో పెద్దకొండపై అర్థాంతరంగా నిలిచిపోయిన కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు పూనుకున్నారు. 15 ఏళ్ల క్రితం టీడీపీ నాయకులు ఆలయ నిర్మాణానికి సిద్ధమై.. పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో నిర్మాణం చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ పరిస్థితిలో వైఎస్సార్‌సీపీకి వార్డు సభ్యులు దాసరి మోహనరావు, కమ్మకట్ల అప్పలరాజురెడ్డి, దేవాది రాము, వలంటీర్ గందాపు ప్రశాంత్ తదితరులు గ్రామస్తుల సహకారంతో గుడి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నడుంబిగించారు. సోమవారం పొక్లయినర్‌తో ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. బుధవారం పునః ప్రతిష్టచేసి ఆలయ నిర్మాణాన్ని ప్రారంభిస్తామని నాయకులు చెప్పారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 26 వినతులు

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 26 వినతులు అందాయి. వాటిలో సంతబొమ్మాళి మండలం రాజపురం వద్ద నూతనంగా నిర్మాణం చేస్తున్న వంతెన పనుల్లో భాగంగా పొలాల సమీపంలో వేసిన మట్టిని తొలగించాలని రైతులు విన్నవించారు.

నిత్యావసర సరకులు వితరణ

కంచిలి: మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాన ఆశ్రమానికి ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన అలియన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 20 రోజులకు సరిపడా నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. వీటిని సంస్థకు చెందిన లలితాంబిక క్లాత్ స్టోర్ అధినేత వెంకటరమణ, కాళ్ల నరసింహమూర్తిల ఆర్థిక సహాయంతో సంస్థ తరఫున సోమవారం అందించారు. క్లబ్ అధ్యక్షుడు లోపింటి నరసింహమూర్తి, కార్యదర్శి తిప్పన లక్ష్మణరెడ్డి, సభ్యులు కె.యోగి, బుజ్జి, సీహెచ్ వెంకటరమణ, ఉమాశంకర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున మున్సిపాలి టీ పరిధి గొల్లవీధి, వీకేపేట, రత్తకన్న గ్రామాల కు మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా కృష్ణమూర్తి

మందస: మందస మండల డిప్యూటీ తహసీల్దార్‌గా మద్దిల కృష్ణమూర్తి నియమితులయ్యారు. కంచిలి మండలంలో రీసర్వే డీటీగా పని చేస్తున్న ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెచ్‌డీ డీటీగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న కె.విజయలక్ష్మి బదిలీపై నాలుగు నెలల క్రితం శ్రీకాకుళం వెళ్లిపోయారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గురుకుల పాఠశాలకు విశ్రాంతి ఉద్యోగులు క్రీడా సామగ్రిని సమకూర్చారు. వీటిని ప్రిన్సిపాల్ పాపారావు సమక్షంలో సోమవారం అందజేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. సామగ్రి అందిన వారిలో కె.సోమశేఖర్, కె.ముకుందరావు, కె.త్రినాథ్, చొక్కర ధనరాజ్.ఎ. దుర్గారావు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం: సమాజానికి వెన్నెముక వంటి యువత ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ఎయిడ్స్‌ను తరిమికొట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన నర్సింగ్ శెట్టి పూరిల్లు ఆదివారం రాత్రి కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ సోమవారం పరామర్శించారు. జగనన్న కాలనీలో ఇల్లుతో పాటు నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసర సరుకులు అందజేశారు.